

ప్రజా న్యూస్

— నెటవర్క్ —

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక ||



తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 157,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,గురువారం , తేదీ :08-10-2026



త్వరలో బీజేపీలో కీలక పదవి అంటూ ప్రచారం.. బండి సంజయ్ నోట ఆసక్తికర మాటలు!

- బీజేపీ తనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్న కేంద్ర మంత్రి
- ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని వ్యాఖ్య
- పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదని వెల్లడి
- కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి డ్రామాలని విమర్శ
- 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపణ

యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్..

రూ.40,000 కోట్ల భారం ఎవరిదని ప్రశ్న!

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు

- బొగ్గు లింకేజీ లేకుండానే ప్లాంట్ కట్టి ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని భట్టి ఆరోపణ
- గరిష్ఠ డిమాండ్ ఉన్నా రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని వెల్లడి
- జెన్‌కో, ట్రాన్స్‌కోల ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన డిప్యూటీ సీఎం



హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం మిగతా 2 లో

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక.. రెండు డీఏలు విడుదల



- ఉద్యోగులకు రెండు పెండింగ్ డీఏలు మంజూరు చేసిన తెలంగాణ ప్రభుత్వం
- మొత్తం 6.37 శాతం పెరగనున్న కరువు భత్యం
- అక్టోబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2,500 కోట్ల అదనపు భారం

హైదరాబాద్: దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది.



కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

- తమిళనాడు సీఎం విజయ్‌తో ఏపీసీసీ చీఫ్ షర్మిల భేటీ
- భర్త అనిల్ కుమార్‌తో కలిసి సీఎంను కలిసిన షర్మిల
- కుమార్తె అంజలి రెడ్డి వివాహానికి విజయ్‌ను ఆహ్వానించిన దంపతులు
- వివాహ పత్రిక అందించి వేడుకకు రావాల్సిందిగా విజ్ఞప్తి

పాతికేళ్ల ప్రజా ప్రస్థానం..

ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని కొనియాడిన రాష్ట్ర మంత్రివర్గం

- భారత్ ప్రతిష్ఠను ప్రపంచ వేదికపై పెంచారని ప్రశంస
- దూరదృష్టి, సమర్థ పాలనతో దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారని కితాబు
- దేశసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష



అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది. తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, మిగతా 2 లో

రాయలసీమకు ఏం చేశారు? రూ.24,000 కోట్లు ఎక్కడ? చంద్రబాబుపై రోజా ఫైర్



- రాయలసీమలో కరవు, సాగునీటి సమస్యలపై ప్రభుత్వం విఫలమైందని రోజా విమర్శ
- కరవు, చంద్రబాబు కవలలుగా అభివర్ణన
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రకటించాలని సవాల్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు,



తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. దర్శనానికి 12 గంటలు

- తిరుమల గిరులపై భక్తజన సందోహం
- టోకెన్లు లేకుండా వచ్చిన వారికి సర్వదర్శనానికి 12 గంటల సమయం
- భక్తులతో నిండిపోయిన 31 కంపార్ట్‌మెంట్లు
- మంగళవారం నాడు శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లు



విష్ణువు చివరి అవతారమైన 'కల్కి'గా మోదీ కనిపిస్తున్నారు..

భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు

'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని వ్యాఖ్య

ప్రజా జీవితంలో మోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యాఖ్యలు

ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే ప్రశంసల వర్షం కురిపించారు. మోదీని తనకు అన్నయ్యగా భావిస్తానని, ఆయనను విష్ణువు అవతారంగా కూడా చూస్తానని చెప్పారు. మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా మిగతా 2 లో

ప్రధాని మోదీపై భూటాన్ ప్రధాని పీఎం టోబ్గే ప్రశంసల వర్షం

గ్లోబల్ సౌత్ గొంతుకను ప్రపంచ వేదికపై వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని వ్యాఖ్య

2019లోనే మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే

ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ.. భారతీయులకు సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

'మనం సాధించగలం' అంటూ మోదీ నినాదం

- ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని మోదీ
- 2047 నాటికి వికసిత భారత్‌తో పాటు ఐదు భారీ లక్ష్యాల ప్రకటన



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, మిగతా 2 లో

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు.. వాటిని మెడల్స్ గా భావిస్తా

తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై స్పందించిన రాహుల్ గాంధీ

తనపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లుం ఉన్నాయని వెల్లడి

'ఇండియా' కూటమి ఎంపీలతో ఖర్గే భోజన సమావేశం

ఈసీపై పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం

భేటీ అనంతరం జంతర్ మంతర్‌లో నిరసనకు విపక్షాలు సిద్ధం



ఢిల్లీ: ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, మిగతా 2 లో

ఐదు లక్ష్యాలు నిర్దేశిస్తూ.. భారతీయులకు
సరికొత్త నినాదం ఇచ్చిన ప్రధాని మోదీ

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజల్లో సరికొత్త స్ఫూర్తిని నింపుతూ "మనం సాధించగలం" అనే కొత్త నినాదాన్ని ఇచ్చారు. తాను ప్రభుత్వ అధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, బుధవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా దేశం ముందు ఐదు భారీ లక్ష్యాలను ఉంచి, వాటిని సాధించి తీరాలని పిలుపునిచ్చారు. సరిగ్గా పాతికేళ్ల క్రితం, 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కేశూభాయ్ పటేల్ తర్వాత రాష్ట్ర 14వ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రత్యేకమైన రోజును కేవలం జ్ఞాపకాలకే పరిమితం చేయకుండా, దేశం కోసం కొత్త సంకల్పం తీసుకునే రోజుగా ఆయన మలిచారు. "ఈ రోజు కేవలం గతాన్ని స్మరించుకునేది మాత్రమే కాదు, మన సంకల్పంలో కొత్త శక్తిని నింపే రోజు. మనం ఏదైనా సాధించగలమనే వాగ్దానాన్ని పునరుద్ఘాటించే రోజు" అని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యంతో పాటు మరో ఐదు కీలక లక్ష్యాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచారు. అవి:

1. ప్రపంచంలోని మొదటి మూడు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా భారత్‌ను నిలపడం.
2. ఆత్మనిర్భర్ భారత్ (స్వయం సమృద్ధి) సాధించడం.
3. భారత్‌ను ప్రపంచ తయారీ కేంద్రంగా (గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్) తీర్చిదిద్దడం.
4. ఒలింపిక్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడం.
5. అంతరిక్షంలోకి మానవసహిత యాత్రను చేపట్టడం.

ప్రధాని మోదీ ఒక్కో లక్ష్యాన్ని ప్రకటిస్తున్నప్పుడు, స్టేడియంలోని వేలాది మంది ప్రజలు "మనం సాధించగలం" అంటూ మిన్నంటేలా నినదించారు. ఈ ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అసాధారణమైనవని ప్రధాని ప్రశంసించారు.

సంక్షోభాలను ఎదుర్కొని నిలిచాం

గతంలో సంక్షోభాలు తలెత్తినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యేదని, కానీ నేడు సంక్షోభ సమయాల్లో భారత్ చూపుతున్న పటిష్ఠత, స్థితిస్థాపకత గురించి ప్రపంచం చర్చించుకుంటోందని మోదీ అన్నారు. "ఒకప్పుడు దేశంలో విధానపరమైన స్తబ్ధత (పాలసీ పారాలిసిస్) గురించి చర్చ జరిగేది. నేడు సంస్కరణల ఎక్స్‌ప్రెస్ గురించి మాట్లాడుకుంటున్నారు" అంటూ అప్పటి యూపీఏ-2 ప్రభుత్వాన్ని ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. చిన్న లక్ష్యాలు పెట్టుకోవడం దేశ సామర్థ్యాన్ని తక్కువ చేయడమేనని, అందుకే భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లక్ష్యాలన్నీ 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకేనని మోదీ స్పష్టం చేశారు.


సవాళ్ల నడుమ స్ఫూర్తి నింపే ప్రయత్నం

ప్రతిపక్షాల నుంచి విమర్శలు, నిరసనలు ఎదురవుతున్న తరుణంలో, ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో, మద్దతుదారుల్లో మోదీ ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) విషయంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ సాగుతున్న నిరసనలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆరోపణలు, యూజీసీ మార్గదర్శకాలపై వ్యతిరేకత వంటి సవాళ్లను ప్రభుత్వం ఎదుర్కొంటోన్న నేపథ్యంలో, ప్రధాని ప్రసంగం బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది.

అందుకు దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా: ప్రధాని మోదీ

ఢిల్లీ: ప్రభుత్వాధినేతగా తాను నిరంతరాయంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అతిపెద్ద బాధ్యత అని, తనపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని ఆయన అన్నారు. నేడు ఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ'లో పాల్గొన్న మోదీ, ఈ చారిత్రక మైలురాయి సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లుతూ, బీజేపీ జెండాలు ఊపుతూ 'భారత్ మాతా కీ జై', 'స్వాగత్ హై భాయ్ స్వాగత్ హై, మోదీజీ కా స్వాగత్ హై' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చాలామంది ఈ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ మైలురాయిని చేరుకుంటానని అస్సలు ఊహించలేదు. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదానికి నిదర్శనం. ప్రజాస్వామ్యంపై అపారమైన విశ్వాసం ఉన్న భారతీయ జనతా పార్టీ, ఎన్డీఏ, ఇతర రాజకీయ సహచరులందరికీ నా కృతజ్ఞతలు. దేశ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అసెంబ్లీ లేదా లోక్‌సభ ఎన్నికలు ఏవైనా, గత 25 ఏళ్లుగా ప్రజలు నన్ను తమ సేవకుడిగా ఎంచుకున్నారు" అని తెలిపారు. "నాకు ప్రజలే దైవ స్వరూపం. లక్షలాది మంది దేశప్రజల నమ్మకం, కార్యకర్తల కష్టమే నాకు ఎప్పటికీ అతిపెద్ద బలం. ఈ దేశం నాకు ఎంతో ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత కూడా అతిపెద్దది. నాపై ఈ దేశంలోని ప్రతి పౌరుడికీ గొప్ప హక్కు ఉందని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను" అని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ 25 ఏళ్ల ప్రస్థానం పూర్తయిన సందర్భంగా ఈరోజు ఉదయం ఢిల్లీలోని సరోజినీ నగర్‌లో ఉన్న శ్రీ వినాయక మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న తన కుటుంబ సభ్యుల (ప్రజల) సంతోషం, శ్రేయస్సు, ఆరోగ్యం కోసం ప్రార్థించినట్లు ఆయన వివరించారు. 2001 అక్టోబర్ 7న కేశూభాయ్ పటేల్ స్థానంలో నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. వినాశకరమైన భూజ్ భూకంపం అనంతర పరిణామాలు, రాజకీయ, పరిపాలనాపరమైన సవాళ్లతో రాష్ట్రం సతమతమవుతున్న క్లిష్ట సమయంలో ఆయన ఆ పదవిని అలంకరించారు. 2014 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ప్రధానమంత్రిగా మోదీ హయాంలో అంతర్జాతీయంగా భారత్‌కు గుర్తింపు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం దౌత్యపరమైన సంబంధాలను బలోపేతం చేయడం, ప్రపంచంలోని ప్రధాన దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడం, 'గ్లోబల్ సౌత్' దేశాలకు భారత్‌ను కీలక గొంతుకగా నిలబెట్టడంలో ప్రత్యేక చొరవ తీసుకుంది.

12 అజెండా అంశాలకు ఆమోదం తెలిపిన ఏపీ కేబినెట్



అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని అభినందిస్తూ ఏపీ కేబినెట్ ప్రత్యేక తీర్మానం ఆమోదించిందని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. 'తల్లికి వందనం'కు రూ.10,208 కోట్లు కేటాయించి 68.05 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి కల్పించడంతో పాటు.. వసతి గృహాలు, గురుకులాల డైట్ ఛార్జీలను 10 శాతం పెంచినట్లు చెప్పారు. విదేశీ, ప్రైవేట్ వర్సిటీలను ఆకర్షించే ఉన్నత విద్యా విధానం-2026, గిరిజన విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్, రేపల్లె ఆస్పత్రి విస్తరణ వంటి కీలక నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన ఆశా కార్యకర్తలకు రూ.1.50 లక్షల వరకు గ్రాట్యుటీ, కొండేపిలో గురుకులానికి 7 ఎకరాలు, ఆలయాభివృద్ధికి 7.66 ఎకరాల కేటాయింపుతో పాటు పేదల ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి మంత్రుల సబ్‌కమిటీ ఏర్పాటు చేసినట్లు పార్థసారథి తెలిపారు.

కేబినెట్ భేటీలో 12 అంశాలకు ఆమోదం..

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు 3 గంటల పాటు సాగిన కేబినెట్ భేటీలో 12 అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు. హార్టికల్చర్ ఇన్సూర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోసం రూ.20.62 కోట్లు ×××మీ ప్రాజెక్టుకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. విశాఖ మరికవలసలో గిరిజన విద్యార్థుల కోసం ××-జీజుజు, చీజుజు కోచింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీకి మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ యాదవ్, కందుల దుర్గేష్ గైర్హాజరయ్యారు. కేబినెట్ భేటీ అనంతరం రాజధాని భూముల అంశంపై మంత్రి నారాయణకు సీఎం పలు సూచనలు చేశారు. కేటగిరీ-4, ఎండోమెంట్ భూముల అంశంపై చర్చించారు. భూములకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మరోసారి తన దృష్టికి తీసుకురావాలని సీఎం తెలిపారు.

నిబద్ధతతో పనిచేస్తే నామినేటెడ్ పదవి

150 మంది కార్యకర్తలకు అవకాశం

తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి లోకేశ్ వెల్లడి

అమరావతి: పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన నాయకులు, కార్యకర్తలు కొందర్ని ఎవరి సిఫారసు అవసరం లేకుండా నేరుగా నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయనున్నట్లు తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. 2024 ఎన్నికలకు ముందు నుంచి పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆరు కార్యక్రమాల్లో పనితీరును ప్రామాణికంగా తీసుకుని పదవులకు ఎంపిక చేస్తామన్నారు. మొత్తం ఆరు కార్యక్రమాల్లోనూ అత్యుత్తమ పనితీరు కనబరిచి, అవార్డులు అందుకున్నవారికి తొలి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. ఆ తర్వాత ఐదు, నాలుగు కార్యక్రమాల్లో అవార్డులు సాధించినవారికి అవకాశమిస్తామన్నారు. మంగళవారం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో నిబద్ధతతో పాల్గొన్నవారిని గుర్తించి.. వారి స్థాయిని, సామర్థ్యాన్ని బట్టి రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో నియమిస్తాం. ఈ ప్రతిపాదనకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఆమోదం తెలిపారు. పదవుల కోసం సుమారు 150 మందిని ప్రాథమికంగా గుర్తించాం' అని వివరించారు.

కార్యకర్తలను పట్టించుకోని ఎమ్మెల్యేలకు హెచ్చరిక

కార్యకర్తలకు మొదటి నుంచీ తెదేపా పెద్దపీట వేస్తోందని, అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని లోకేశ్ తెలిపారు. వారి సంక్షేమానికి ఇప్పటి వరకు రూ.200 కోట్లు ఖర్చు చేశామన్నారు. 'ఎమ్మెల్యేలు నిరంతరం కార్యకర్తలతో మాట్లాడుతూ, వారికి అందుబాటులో ఉండాలని చెబుతున్నాం. మాట వినని వారిని గట్టిగానే హెచ్చరిస్తున్నాం. కూటమి పార్టీలు విస్తృత సమన్వయంలో పనిచేస్తున్నాయి. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలున్నా సర్దుబాటు చేసుకుంటూ ముందుకెళ్తాం. పార్టీ స్థాపించి నాలుగు దశాబ్దాలు దాటినా ఇంకా అన్ని జిల్లాల్లో కార్యాలయాల్లేవు. ప్రస్తుతం వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. భవిష్యత్తులో నియోజకవర్గ స్థాయిలోనూ పార్టీ కార్యాలయాలు నిర్మిస్తాం. ముఖ్యమంత్రి, నేను కార్యకర్తలతో నిర్వహిస్తున్న సమావేశాలు వచ్చే డిసెంబరు నాటికి 175 నియోజకవర్గాల్లోనూ పూర్తవుతాయి. తర్వాత రెండో దఫా సమావేశాలు ప్రారంభిస్తాం. ఇటీవల నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం 40 రోజుల కార్యక్రమంగా చేశాం. భవిష్యత్తులో ఇంకా తక్కువ రోజుల్లోనే ఇంటింటికీ చేరాలన్న లక్ష్యంతో కార్యక్రమాలు రూపొందిస్తాం' అని లోకేశ్ వెల్లడించారు.

పాతికేళ్ల ప్రజా ప్రస్థానం..
ప్రధాని మోదీకి ఏపీ కేబినెట్ అభినందన తీర్మానం

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాతికేళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిమండలి ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేసింది. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా దేశానికి స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని అందిస్తున్నారని కొనియాడుతూ రాష్ట్ర కేబినెట్ ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించింది. అసాధారణ క్రమశిక్షణ, నిబద్ధత, గొప్ప దార్శనికతతో మోదీ దేశానికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మంత్రివర్గం ప్రశంసించింది. తన దార్శనికత, స్పష్టమైన లక్ష్యాలు, సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచపటంలో అత్యున్నత స్థానంలో నిలిపారని తీర్మానంలో పేర్కొంది. మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపిస్తున్నారని మంత్రివర్గం స్పష్టం చేసింది. సృజనాత్మకతకు, నూతన ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ పారదర్శకమైన, వేగవంతమైన పాలన అందిస్తున్నారని అభిప్రాయపడింది. సహకార సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేస్తూ దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపిస్తున్నారని కొనియాడింది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రధాని మోదీ దేశానికి స్థిరమైన, పటిష్ఠమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని కేబినెట్ వెల్లడించింది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూనే, దేశ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చి అంతర్జాతీయ వేదికలపై భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారని ప్రశంసించింది. వ్యూహాత్మక భాగస్వామ్యాల ద్వారా ప్రపంచ దేశాలతో దౌత్య సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ కృషి అనిర్వచనీయమని అభిప్రాయపడింది. ఆధునిక, సాంకేతిక, స్వయం సమృద్ధి కలిగిన నవభారత నిర్మాణానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తీర్మానం తెలిపింది. మోదీ దార్శనికత, రాజనీతిజ్ఞతతో భారత ప్రగతికి పటిష్ఠమైన పునాదులు పడ్డాయని ఏపీ మంత్రివర్గం అభిప్రాయపడింది. 21వ శతాబ్దం ప్రధాని మోదీ నాయకత్వానిదేనని, దేశసేవలో ఆయన మరిన్ని మైలురాళ్లను అధిగమించాలని ఆకాంక్షిస్తూ కేబినెట్ తన తీర్మానంలో పేర్కొంది.

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు..
వాటిని మెడల్స్ గా భావిస్తా: రాహుల్ గాంధీ

ఢిల్లీ: ఈసీ కార్యాలయం ముట్టడి నేపథ్యంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను తేలిగ్గా తీసుకున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు. కాగా, మంవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

కుమార్తె పెళ్లికి తమిళనాడు సీఎం
విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల

అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, అనురాగం ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాబోయే దంపతులకు సీఎం విజయ్ తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్ షర్మిల వివరించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

విష్ణువు చివరి అవతారమైన 'కల్కి'గా మోదీ కనిపిస్తున్నారు.. భూటాన్ ప్రధాని ఆసక్తికర వ్యాఖ్యలు

ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీపై భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే ప్రశంసల వర్షం కురిపించారు. మోదీని తనకు అన్నయ్యగా భావిస్తానని, ఆయనను విష్ణువు అవతారంగా కూడా చూస్తానని చెప్పారు. మోదీ 25 ఏళ్లుగా ప్రభుత్వ అధినేతగా కొనసాగుతూ ప్రజా సేవ చేస్తున్న తీరును కొనియాడారు. మోదీ నాయకత్వంలో పొరుగు దేశాలతో సంబంధాలకు భారత్ ప్రాధాన్యం ఇస్తోందని టోబ్గే పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకను ప్రపంచ వేదికపై బలంగా వినిపించడంలో మోదీ కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆఫ్రికన్ యూనియన్‌ను జీ20లో శాశ్వత సభ్యుడిగా చేర్చడంలోనూ ఆయన కృషిని ప్రశంసించారు. మోదీతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న టోబ్గే.. ఆయనను చాలాకాలంగా అన్నయ్యగా భావిస్తున్నానని తెలిపారు. తర్వాత ఆయనను మార్గదర్శకుడిగా కూడా చూసినట్లు చెప్పారు. 2019లో మోదీని విష్ణువు అవతారంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. 2024లో ఢిల్లీలో మోదీని కలిసినప్పుడు తాను గతంలో చెప్పిన మాటల గురించి ఆలోచించానని, తాను తప్పుగా చెప్పలేదని తేల్చుకున్నానన్నారు. విష్ణువు చివరి అవతారమైన కల్కిగా మోదీ కనిపిస్తున్నారని టోబ్గే అన్నారు. అశాంతిని తొలగించి ధర్మాన్ని పునరుద్ధరించి కొత్త మార్పుకు నాంది పలికే అవతారమే కల్కి అని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' అంటే 'వికసిత్ భూటాన్' కూడా అని టోబ్గే వ్యాఖ్యానించారు. 2014లో ప్రధాని అయిన కొద్ది వారాల్లోనే మోదీ తన తొలి విదేశీ పర్యటనకు భూటాన్‌ను ఎంచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఆ పర్యటనలో భారత్-భూటాన్ సంబంధాలను 'బీ4బీ'గా మోదీ అభివర్ణించారని తెలిపారు. అంటే 'భూటాన్ కోసం భారత్.. భారత్ కోసం భూటాన్' అని వివరించారు. భూటాన్ అభివృద్ధి ప్రణాళికలకు భారత్ అందిస్తున్న సహకారాన్ని టోబ్గే ప్రశంసించారు. 13వ పంచవర్ష ప్రణాళిక కోసం భారత్ అందించే సాయాన్ని మోదీ ప్రభుత్వం రూ.10 వేల కోట్లకు పెంచిందని చెప్పారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, జల విద్యుత్, సాంకేతికత, వ్యవసాయం, వ్యాపార రంగాల్లో ఇరు దేశాల సహకారం విస్తరించిందన్నారు. భూటాన్ రాజు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గెలెఫు మైండ్‌ఫుల్‌నెస్ సిటీ ప్రాజెక్టుకు భారత్ పూర్తి మద్దతు ఇస్తోందని తెలిపారు. రైలు మార్గాలు, సరిహద్దు మౌలిక వసతులు, విమాన, డిజిటల్ కనెక్టివిటీ అభివృద్ధి దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..
దర్శనానికి 12 గంటలు

తిరుపతి: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం ఉదయం నాటికి, శ్రీవారి దర్శనం కోసం 31 వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు స్వామివారి దర్శనానికి సుమారు 12 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. మంగళవారం (అక్టోబర్ 6) ఒక్కరోజే 73,629 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 27,525 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.33 కోట్లుగా నమోదైంది. అదేవిధంగా, టీటీడీ నిన్న 3.91 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సత్రంలో 1.75 లక్షల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో 3,334 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ నేపథ్యంలో టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తోంది.

రాయలసీమకు ఏం చేశారు?
రూ.24,000 కోట్లు ఎక్కడ?: చంద్రబాబుపై రోజా ఫైర్

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాయలసీమలో కరవు, సాగునీటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, అభివృద్ధిపై కేవలం గొప్పలు చెబుతోందని ఆమె ఆరోపించారు. చిత్తూరులో మీడియాతో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ మాటలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు పొంతన లేదన్నారు. "రాయలసీమపై ప్రేమ ఉందని చెబుతారు. కానీ ఈ ప్రాంతానికి ఏం చేశారు? రూ.24,000 కోట్లతో ప్రాజెక్టులు చేపట్టామని అంటున్నారు. అవి ఎక్కడున్నాయో ప్రజలకు చూపించండి" అని రోజా సవాల్ విసిరారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరవు, చంద్రబాబు కవలలని, ప్రస్తుత పాలనలో నీటి కొరత మరింత తీవ్రమైందని ఆమె వ్యాఖ్యానించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి, జగన్ హయాంలో చేపట్టిన సాగునీటి, వ్యవసాయ చర్యల నుంచి ప్రభుత్వం పాఠాలు నేర్చుకోవాలని రోజా సూచించారు. 'రైజింగ్ రాయలసీమ' అంటూ నినాదాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, కొత్తగా ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించారో అధికారిక లెక్కలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అబద్ధాలు చెప్పడంలో చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోటీ పడుతున్నారని ఆమె ఆరోపించారు.

ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం
దసరా కానుక.. రెండు డీఏలు విడుదల

హైదరాబాద్: దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించ

ముసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి భూసేకరణ అంశాలపై కలెక్టర్‌తో ఉప్పల్ ఎమ్మెల్యే భేటీ

ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 7 :

(ప్రజా న్యూస్ నెట్‌వర్క్) ముసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పరిధిలో భూసేకరణ, ల్యాండ్ పూలింగ్, భూ యజమానులకు కల్పించాల్సిన ప్రయోజనాలు తదితర అంశాలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీ.ఓ.ఏంఎస్.నెంబర్.240, ఏంఏ మరియు యుడి (ప్లేజ్.1) డిపార్ట్మెంట్, తేదీ 19-09-2026 ద్వారా ముసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఏరియాలో ల్యాండ్ పూలింగ్ అమలుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. ముసీ ప్రాజెక్టు పరిధిలో పట్టా భూములు, బఫర్ ఏరియా, రివర్ బెడ్/ఎఫ్ ఎల్ టి ప్రాంతాలు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు తదితర వివిధ రకాల భూములు ఉన్నందున, ఆయా భూ యజమానులు, రైతులు, బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పారదర్శకంగా అమలు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రత్యేకంగా భూ యజమానులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు/డెవలప్ చేయగల భూమి కేటాయింపు, ల్యాండ్ పూలింగ్‌లో వాటా, పరిహారం, స్టాంప్ డ్యూటీ తదితర అంశాలపై అధికారులతో సమన్వయం చేసుకుని బాధితులకు స్పష్టత కల్పించాలని కోరారు. 1400 ఇవ్వాలని కోరారు ప్రతాప సింగారం వద్ద 1750 ఇస్తున్నారు అని తెలిపారు 60:40 ప్రకారం ఇవ్వాలని కోరడం జరిగింది ముసీ



రివర్‌ఫ్రంట్ అభివృద్ధి ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా, భూ యజమానుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ, న్యాయబద్ధంగా మరియు పారదర్శకంగా ముందుకు సాగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సల్ల వీరారెడ్డి, పంగా మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

దాతల కోసం నాయకుడి ఎదురుచూపు అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిక

ఎల్కతుర్తి అక్టోబర్ 7 ప్రజా న్యూస్ నెట్‌వర్క్, రిపోర్టర్ బొంకూరి కార్తిక్:

మండలంలోని దామెర గ్రామానికి చెందిన సాతూరి వెంకన్న అనారోగ్యంతో హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గత 20 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.



పేదరికం ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్య సమస్యలతో వెంకన్న తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు వైద్య ఖర్చులు భారంగా మారడంతో దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. మానవతా దృక్పథంతో దాతలు ప్రజలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి వెంకన్నకు అండగా నిలవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. సహాయం చేయదలచిన వారు 9849562726 నంబర్‌కు ఫోన్‌పే ద్వారా ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

క్రాంతి నగర్‌లో రూ.16 లక్షల సిఎం సి నిధులతో సీసీ రోడ్డు ప్రారంభం

కుత్బుల్లాపూర్. అక్టోబర్. ప్రజా న్యూస్ నెట్వర్క్..

బాచుపల్లి: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని క్రాంతి నగర్‌లో సిఎం సి నిధులు రూ.16 లక్షల వ్యయంతో 110 మీటర్ల పొడవున నిర్మించిన సీసీ రోడ్డును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ,

నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన చోట నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కొలన్ జీవన్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, కోటపాటి మురళి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ బాల్ రెడ్డి, పద్మారావు, మనోజ్ పాల్గొన్నారు. అలాగే శ్రీ హోమ్స్ కాలనీ అధ్యక్షులు అంజయ్య గౌడ్, క్రాంతి నగర్ కాలనీ అధ్యక్షులు బుగ్గ రెడ్డి, క్రాంతి నగర్ అసోసియేషన్ కోశాధికారి శ్రీధర్, ఉపాధ్యక్షులు తోట హరిబాబు, కాంగ్రెస్ నాయకులు నరేష్, నవీన్ కుమార్, నరసింహులు, కృష్ణ, జగదీష్, భాషా, శ్రవణ్ మరియు క్రాంతి నగర్ సోషల్ వెల్ఫేర్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మెడికల్ అధికారిని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 7 :

(ప్రజా న్యూస్ నెట్‌వర్క్) మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డా ఆనంద్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ వైద్య సేవలు, ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలు, ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక వసతులు, ప్రజారోగ్య సమస్యలపై చర్చించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. నియోజకవర్గంలో వైద్య రంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయంతో పనిచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి ఇటుక రాజు మాదిగ కి ఇవ్వాలి

: తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపకులు అధ్యక్షులు గంధం సుమన్ మాదిగ హైదరాబాద్ లో తన ఆఫీసులో మాట్లాడుతున్నారు

కుత్బుల్లాపూర్. అక్టోబర్ 7 . ప్రజా న్యూస్ నెట్వర్క్..

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనమల రేవంత్ రెడ్డి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆరోగ్యశాఖ మంత్రులు దామోదర్ రాజనర్సింహా ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు వెంటనే అధికారికంగా పూర్వకంగా ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఎన్నికలో ఎస్సీ ఎస్టీ దళితులు కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓట్లు వేసి విధంగా ప్రచారం కొనసాగించినారు కృషి చేసినారు ప్రత్యేకంగా కోరుచున్నాము



సంచి చిన్నదైంది బిల్లు పెద్దదైంది

– నిన్నటి రూ.వెయ్యి సంచికి నేటి రూ.2 వేల బిల్లు
– బియ్యం నుంచి పెరుగు వరకు జేబుకే ఎందుకీ పరీక్ష
– జీతం పెరగదు ధరలకు మాత్రం బ్రేకుల్లేవా

నెల్లూరు అక్టోబర్ 7 ప్రజాన్యూస్ నెట్ వర్క్. రిపోర్టర్ యు. ప్రవీణ్ కుమార్ :

ఈసారి నెల ఖర్చు కాస్త తగ్గించుకుందాం అవసరమైనవే కొనుక్కుందాం అని ఓ మధ్యతరగతి కుటుంబం మార్కెట్‌కు బయలుదేరింది. బియ్యం బస్తా పాల ప్యాకెట్లు పెరుగు కూరగాయలు అంతే పెద్దగా ఏమీ కొనలేదు. కానీ ఇంటికి చేరేసరికి చేతిలో ఉన్న సంచి తేలికగానే ఉంది.. బిల్లు మాత్రం బరువెక్కింది ఇదే నేటి మధ్యతరగతి కుటుంబాల పరిస్థితికి ఓ చిన్న ఉదాహరణ. బియ్యం బస్తాపై సుమారు రూ.250 వరకు అదనపు భారం పడిందని వినియోగదారులు చెబుతున్నారు. పాల ప్యాకెట్ ధర రూ.40కు చేరిందని పేర్కొంటున్నారు. పెరుగు ప్యాకెట్ల ధరలు డెయిరీని బట్టి మారుతున్నాయి. ఇక కూరగాయల సంగతి చెప్పాల్సిన పనిలేదు మార్కెట్‌కు వెళ్లే ముందు ఒక ధర కొనేసరికి మరో ధర అన్నట్టుగా వినియోగదారుల అనుభవాలు ఉంటున్నాయి. పది రూపాయలు పెరిగితే ఏం అవుతుంది అని ఒక్కో వస్తువుపై ప్రశ్నించవచ్చు. కానీ ఇంట్లో కొనాల్సిన వస్తువులు పది ఉంటే ఆ పది రూపాయలే వంద అవుతుంది. వందల రూపాయలు వెయ్యి అవుతాయి. నెలకు నాలుగు సార్లు మార్కెట్‌కు వెళ్తే ఆ భారం మరింత పెరుగుతుంది. చివరకు నెల జీతం రాకముందే ఇంటి ఖర్చుల లెక్కలు జీతాన్ని పలకరిస్తున్న పరిస్థితిఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ధరలు పెరుగుతున్న వేగంతో సామాన్యుడి ఆదాయం కూడా పెరుగుతోందా ఉద్యోగి జీతం ప్రతి నెలా మార్కెట్ ధరలకు తగ్గట్టుగా పెరగదు. చిన్న వ్యాపారి ఆదాయం ప్రతిరోజూ ఒకేలా ఉండదు. కూలీకి వచ్చే పని కూడా ప్రతిరోజూ ఒకేలా ఉండదు. కానీ ఇంట్లో పాలు మాత్రం ప్రతిరోజూ



కావాలి బియ్యం కావాలి కూరగాయలు కావాలి పిల్లలకు అవసరాలు ఉంటాయిధరల పెరుగుదలకు ఉత్పత్తి వ్యయం రవాణా సరఫరా మార్కెట్ పరిస్థితులు తదితర కారణాలు ఉన్నాయా ఏదైనా వస్తువు గరిష్ఠ చిల్లర ధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నారా వివిధ ప్రాంతాల్లో వివిధ దుకాణాల్లో ఒకే వస్తువుకు ధరల్లో ఎందుకు తేడా వస్తోంది అనే అంశాలు అధికారుల పరిశీలనలో తేలాల్సి ఉంది ఆరోపణలు నిజమా కాదా అన్నది సంబంధిత శాఖల తనిఖీలు అధికారిక సమాచారం ద్వారానే స్పష్టమవుతుందిఅయితే ప్రజల బాధ మాత్రం వాస్తవం. వంటింట్లో వస్తువులు తగ్గుతున్నాయి ఖర్చుల లెక్క మాత్రం తగ్గడం లేదు. నిన్న ఒక కుటుంబం నెలకు ఒకసారి బయట తినేదేమో ఇప్పుడు ఆ ఖర్చును తగ్గించుకోవాల్సి వస్తోంది పిల్లల చిన్న చిన్న కోరికలు వాయిదా పడుతున్నాయి. అవసరం కోరిక మధ్య తేడా చూసుకుంటూ కుటుంబ బడ్జెట్ నడపాల్సిన పరిస్థితి వస్తోంది.

ఒకప్పుడు సంచి నిండా సరుకులు చేతిలో మిగిలే డబ్బు ఉండేదని పెద్దలు చెబుతుంటారు ఇప్పుడు పరిస్థితి తారుమారైందని మధ్యతరగతి కుటుంబాలు వాపోతున్నాయి. సంచి నిండటం లేదు బిల్లు మాత్రం నిండుతోంది ధర పెరిగిందని చెప్పడం మాత్రమే కాదు.. ఎందుకు పెరిగింది ఎక్కడ పెరిగింది ఎంతవరకు సమంజసం వినియోగదారుడి ప్రయోజనాలను కాపాడేందుకు పర్యవేక్షణ ఎలా ఉంది? అన్న ప్రశ్నలకు సమాధానాలు కావాలి ప్రజలు అడగకపోతే ధరలు పెరుగుతూనే ఉంటాయా అధికారులు పట్టించుకోకపోతే మధ్యతరగతి కుటుంబం తన వంటింటినే తగ్గించుకోవాలా

నెల మొదటి తేదీన జీతం వస్తుంది పదో తేదీకి బడ్జెట్ కుదేలవుతుంది ఇరవై తేదీకి లెక్కలు మొదలవుతాయి. నెలాఖరుకు వచ్చే నెల చూద్దాం అనే మాట మిగులుతుంది. మార్కెట్‌లో ధరల బోర్డులు మారుతున్నాయా లేక మధ్యతరగతి జీవితమే మారిపోతోందా సమాధానం చెప్పాల్సింది ఎవరు


గోలి లిఫ్ట్ ఇరిగేషన్‌కు ప్రభుత్వ అనుమతి

6,300 ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రతిపాదన

చెవిటి వెంకట శివ, రిపోర్టర్

ప్రజా న్యూస్, గురజాల మండలం, పల్నాడు జిల్లాగురజాల, అక్టోబర్ 7:


పల్నాడు జిల్లా గురజాల మండల పరిధిలోని రైతుల సాగునీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా గోలి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి ప్రభుత్వం అనుమతి లభించినట్లు స్థానికులు తెలిపారు. గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు చొరవతో ఈ పథకానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించి అనుమతులు పొందినట్లు పేర్కొన్నారు. దైదా సీలుపు వద్ద కృష్ణా నది నుంచి సమాధానంపేట గ్రామం వరకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ పథకం అమలులోకి వస్తే దైదా, గోలి, సమాధానంపేట పరిసర ప్రాంతాల్లో సుమారు 6,300 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందే అవకాశం ఉంది. సాగునీటి సమస్యను స్థానిక రైతులు రొండి సాంబయ్య, రాయపాటి రవి, రొండి పోల్ రాజు తదితరులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమై ప్రభుత్వ అనుమతి లభించిందని, త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయితే ఈ ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గి, వ్యవసాయానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



జోగిపేటలో బోసిపోయిన మార్కెట్ కొనుగోలుదారులు లేక వ్యాపారులు విలవిల

ప్రజా న్యూస్ అక్టోబర్ 07 (అందోల్ ప్రతినిధి ఎండి అభేద్)

అందోలు మండలం జోగిపేట గ్రామంలోని మార్కెట్ ఇటీవల కొనుగోలుదారులు లేక వెలవెలబోతోంది. ఒకప్పుడు రోజంతా రద్దీగా ఉండే దుకాణాలు, ఇప్పుడు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దీంతో వ్యాపారం సాగక చిరు వ్యాపారులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులు చెప్పిన వివరాల ప్రకారం, గతంతో పోలిస్తే కస్టమర్ల రాక బాగా తగ్గింది. రోజువారీ అమ్మకాలు పడిపోవడంతో దుకాణం అద్దెలు, కరెంటు బిల్లులు, పనివారి జీతాలు చెల్లించడం కూడా భారంగా మారిందని వాపోతున్నారు. కొందరు వ్యాపారులు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదని



ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోవడం, పెరిగిన ధరలు, ఇతర కారణాల వల్ల కొనుగోళ్లు తగ్గి ఉండవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే చిన్న వ్యాపారులు కుటుంబ పోషణకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తుందని అంటున్నారు. అధికారులు స్పందించి వ్యాపారులను ఆదుకునే చర్యలు చేపట్టాలని, మార్కెట్‌కు మళ్లీ జీవం పోసేలా చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు.


జోగిపేటలో బోసిపోయిన మార్కెట్

కొనుగోలుదారులు లేక వ్యాపారులు విలవిల..

పడిపోయిన రోజువారీ అమ్మకాలు

అందోల్ మండలం, అక్టోబర్ 07, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, అందోల్ ప్రతినిధి ఎండీ. అభేద్ :

అందోల్ మండలం జోగిపేట మార్కెట్‌లో కొనుగోలుదారుల రాక తగ్గడంతో వ్యాపారాలు మందగించాయి. ఒకప్పుడు రద్దీగా కనిపించిన మార్కెట్ ప్రస్తుతం వెలవెలబోతోంది. అమ్మకాలు తగ్గడంతో దుకాణ అద్దెలు, విద్యుత్ బిల్లులు, పనివారి ఖర్చులు భరించడం కష్టంగా మారిందని వ్యాపారులు వాపోతున్నారు. పెరిగిన ధరలు, ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం వంటి కారణాలతో పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. మార్కెట్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు.



ఆదర్శ్ నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం





చిలకనగర్ డివిజన్‌లోని ఆదర్శ్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 12 లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవ ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ ప్రాంతంలోని రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో చిలకనగర్ డివిజన్ మాజీ అధ్యక్షులు పల్లె నర్సింగ్ రావు సీనియర్ నాయకులు గుడి మధుసూదన్ రెడ్డి, ఈరెల్లి రవీందర్ రెడ్డి, చేర్యాల శ్రీనివాస్, శనిగరం తిరుమలేష్, ఫోటోల రాజు, పల్లె రాములు, బాబు, జనార్దన్, మధు నాయక్, నరేష్, శివరాం
స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

అనసూర్య మృతదేహానికి కాంగ్రెస్ నేతల నివాళి

పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆలంపల్లి జానయ్య

త్రిపురారం మండలం, అక్టోబర్ 07, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, రిపోర్టర్ కాసిరాం :



త్రిపురారం మండల కేంద్రానికి చెందిన నక్కంటి దొరబాబు సతీమణి నక్కంటి అనసూర్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పార్థివదేహానికి త్రిపురారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆలంపల్లి జానయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అనుముల అనంతరెడ్డి, సాగర్ నియోజకవర్గ మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కాసిరెడ్డి నరేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు అనుముల వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పీబీ శ్రీనివాస్, మాజీ మండల యువజన అధ్యక్షుడు పీబీ రవి, గోపు శ్యామ్‌సుందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కూతాటి సాంబయ్య, మైనార్టీ మాజీ సెల్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, పల్లెబోయిన రామలింగం, రసమల్ల శ్రీనివాస్, పడిశాల ఏడుకొండలు, డీలర్ మట్టయ్య తదితరులు పాల్గొన్నారు

నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో ఇస్లావత్ రాంచందర్ నాయక్

చిన్నారులను ఆశీర్వదించిన ట్రైకార్ మాజీ చైర్మన్

త్రిపురారం మండలం, అక్టోబర్ 07, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, రిపోర్టర్ కాసిరాం :

నాగార్జునసాగర్ నియోజకవర్గం పరిధిలోని ముకుందాపురం రేఖా వెంకటరమణ ఫంక్షన్ హాల్‌లో త్రిపురారం మండలం కంపాసాగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దోరెపల్లి ఏడుకొండలు కుమార్తె రూపశ్రీ, కుమారుడు గణేష్‌ల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వచ్చే ఏడు నెలలు నీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి: జగ్గారెడ్డి

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 7 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్



వచ్చే ఏడు నెలలు తాగునీటి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో తాగునీరు, విద్యుత్ సమస్యలపై విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.సింగూరు ప్రాజెక్టులో 29 టీఎంసీలకు గాను ప్రస్తుతం సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అధికారులు వివరించారు. వర్షాలు వచ్చే వరకు మంజీరా, సింగూరు నీటిని తాగునీటి అవసరాలకు పొదుపుగా వినియోగించాలని జగ్గారెడ్డి కోరారు. నీటి వృథాను అరికట్టేందుకు గ్రామాలు, మున్సిపాలిటీల్లో మైక్‌లు, పాంప్లెట్ల ద్వారా ఇంటింటా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.నల్లాలను అవసరం లేనప్పుడు మూసివేయాలని, మోటార్ల వద్ద నీటి వృథాను నియంత్రించాలని సూచించారు. అవసరమైతే మున్సిపాలిటీల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని చెప్పారు.సింగూరు నుంచి ఇటీవల నీటిని విడుదల చేయడం డ్యామ్ భద్రతకు సంబంధించిన నిపుణుల సూచనల మేరకే జరిగిందని జగ్గారెడ్డి తెలిపారు. అలాగే నియోజకవర్గంలో విద్యుత్ బ్రేక్‌డౌన్ల సమస్యల పరిష్కారంపై వచ్చే మంగళవారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ప్రీ ప్రైమరీ టీచర్స్ మరియు ఆయాల సమస్యలు పరిష్కరించాలి...ఏఐటీయూసీ

(సంగారెడ్డి మండలం) అక్టోబర్ 7 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..



సంగారెడ్డి టీఎన్జీఎస్ భవన్ లో టీచర్స్ మరియు ఆయ ల సమస్యలు పరిష్కరించాలని సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం ఏ. రెహమాన్, పోయింది ప్రసాద్ సంయుక్తంగా మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్ ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు అందులో పని చేస్తున్న టీచర్లు మరియు ఆయాలకు కనీస వేతనం ఇవ్వకుండా టీచర్లకు 8000 ఆయాలకు 6000 వేతనమిచ్చే వారికి ఇచ్చినటువంటి ఆర్డర్ కాపీలు ఉదయం 8:45 నిమిషాల నుండి మధ్యాహ్నం 12:30 వరకు వారు విద్యార్థులకు బోధించాలని ఉన్నప్పటికీని వారి చేత పూర్తి కాలం టీచర్ల సాయంత్రం ఐదు గంటల వరకు వారిచేత పని చేయించుకుంటున్నారు జిల్లా అధికార యంత్రాంగం వెంటనే స్పందించి వారికి ఇచ్చినటువంటి ఆర్డర్ కాపీ ప్రకారం వారిని విధులు నిర్వహించుకునే విధంగా చొరవ చూపాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తుంది అలాగే పెండింగ్ వేతనాన్ని వెంటనే విడుదల చేయాలి వారికి తక్షణమే 26 వేల రూపాయలు కనీస వేతనం ఇవ్వాలి షరతులతో కూడిన ఉద్యోగం కాకుండా నిత్య ఉద్యోగులుగా గుర్తించాలి అలాగే ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలి వారికి ఉద్యోగ భద్రతను కల్పించాలి ప్రతి నెల హెడ్మాస్టర్ బ్యాంక్ ఖాతాలో కాకుండా ప్రతినెలా ఒకటవ తేదీన నేరుగా ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్ మరియు ఆయాల నేరుగా బ్యాంకు ఖాతాలోనే వెయ్యాలి ఎగ్జామినేషన్ లేకుండా వారికి ప్రమోషన్లు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు అనంతరం ఈ సమావేశంలో కమిటీని ఎన్నుకోవడం జరిగింది తెలంగాణ ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్స్ మరియు ఆయాల యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎంఏ.రెహమాన్, అధ్యక్షులుగా-కవిత, కార్యదర్శి-విజయతులసి కార్యనిర్వాహక కార్యదర్శి-బోయిని ప్రసాద్, శోభారాణి, ,శ్రావణి,చందన, జగదీశ్వరి, కీర్తన, మౌనిక, మంజుల, నాగమణి, స్వాతి తదితరుల ను ఎన్నుకున్నారు..

సైబర్ నేరాలపై ఉక్కు నిఘా..

మాదకద్రవ్యాలపై కఠిన హెచ్చరిక

- విద్యార్థుల భవిష్యత్తుకు పోలీసుల ప్రత్యేక అవగాహన..

- జెడ్పీహెచ్ఎస్‌లో విస్తృత కార్యక్రమం

హుజూర్‌నగర్ మండలం, అక్టోబర్ 07, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :



హుజూర్‌నగర్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో సైబర్ జాగరూకత దినోత్సవం, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, ఎస్ఐ చలికంటి నరేష్, నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్ రెడ్డి, పాలకవీడు ఎస్ఐ కోటేష్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు.

సీఐ చరమంద రాజు.. సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ :

ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారని సీఐ చరమంద రాజు విద్యార్థులకు వివరించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, రహస్య సంకేతాలు వంటి సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మకుండా ముందుగా పరిశీలించాలని సూచించారు.

ఎస్ఐ చలికంటి నరేష్.. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి :

మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్ఐ చలికంటి నరేష్ తెలిపారు. చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వైపు ఆకర్షితులు కాకుండా చదువు, క్రీడలు, ప్రతిభా రంగాలపై దృష్టి పెట్టాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు వెంటనే తెలియజేయాలని సూచించారు.

నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్ రెడ్డి.. సోషల్ మీడియాలో అప్రమత్తత అవసరం :

సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ గోపాల్ రెడ్డి సూచించారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత విషయాలను పంచుకోవద్దని తెలిపారు. గుర్తుతెలియని లింకులు తెరవడం, అనుమానాస్పద సందేశాలకు స్పందించడం వంటి చర్యలతో సైబర్ నేరాలకు గురయ్యే అవకాశం ఉందని వివరించారు. లైక్స్, వ్యూస్ కోసం ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

పాలకవీడు ఎస్ఐ కోటేష్.. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి :

విద్యార్థులు చిన్న వయసులోనే మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని ఎస్ఐ కోటేష్ సూచించారు. మాదకద్రవ్యాలు, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. స్నేహితుల ఒత్తిడితో తప్పుదారి పట్టకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని కోరారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విద్యార్థుల భద్రతకు పోలీసుల ప్రత్యేక దృష్టి :

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల ప్రభావం నుంచి విద్యార్థులను రక్షించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటంతో పాటు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. మంచి లక్ష్యాలను ఎంచుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని పోలీసులు సూచించారు.

సేవా సంకల్ప్ అభియాన్‌లో సేవా జ్యోతి కలశ యాత్ర

ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 7 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్) :

గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు ప్రజాసేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు అల్వాల్ డైరీ ఫామ్ రోడ్డులోని శోభా గార్డెన్స్‌లో సేవా జ్యోతి కలశ యాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.





బీజేపీ మేడ్చల్,మల్కాజిగిరి (అర్బన్) జిల్లా అధ్యక్షులు శ్రీ డి. గిరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవకు అంకితమైన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మరింత చేరువ కావడం "సేవా సంకల్ప్ అభియాన్" ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు మరియు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సేవా జ్యోతి కలశ యాత్రను ఉత్సాహంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బీరప్పగడ్డ, చిల్కానగర్ డివిజన్లలో మంజూరైన అభివృద్ధి పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలి

ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 7 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్) :

బీరప్పగడ్డ,చిల్కానగర్ డివిజన్లలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి నిధులు మంజూరు చేయించారని, అట్టి పనులకు వెంటనే టెండర్లు పిలిచి, టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులను ప్రారంభించాలని కోరుతూ . బీరప్పగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ శ్రీ ఆకిటి ఆగం రెడ్డి , చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ శ్రీ నల్లవెల్లి మహేందర్ ముదిరాజ్ గారు ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ కలిసి వినతిపత్రం అందజేశారు.



వారు మాట్లాడుతు బీరప్పగడ్డ, చిల్కానగర్ డివిజన్లలో ప్రజల అవసరాల దృష్ట్యా పలు అభివృద్ధి పనులకు ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి చొరవతో ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, అయితే కొన్ని పనులకు ఇంకా టెండర్ ప్రక్రియ పూర్తికాలేదని తెలిపారు. మంజూరైన పనులకు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే టెండర్లు పిలిచి, టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని డిప్యూటీ కమిషనర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్,మల్కాజిగిరి జిల్లా వైస్ ప్రెసిడెంట్, డీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీ కొంపల్లి బాలరాజు, చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అమర్, చందు, శివ, రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో రిపోర్టర్లు, పోలీస్, న్యాయవాదుల షటిల్ టోర్నమెంట్

క్రీడలతో స్నేహభావం, ఐక్యత పెంపొందుతాయి.. టోర్నమెంట్‌ను ప్రారంభించిన పోలీస్ అధికారులు

హుజూర్‌నగర్ మండలం, అక్టోబర్ 07, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్ షటిల్ గ్రౌండ్‌లో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని రిపోర్టర్లు, పోలీస్ సిబ్బంది, న్యాయవాదుల కోసం నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు.

హుజూర్‌నగర్ సీఐ జి.చరమంద రాజు, నేరేడుచర్ల ఎస్ఐ గోపాల్‌రెడ్డి, పాలకవీడు ఎస్ఐ కోటేష్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.



క్రీడలతో స్నేహబంధాలు :

ఈ సందర్భంగా క్రీడలు పోలీస్, మీడియా, న్యాయవాదుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు పరస్పర సమన్వయానికి దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ కన్వీనర్, జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సామ రామ్ మోహన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని వజ్రేష్ యాదవ్ పిలుపు

ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ అక్టోబర్ 07 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్) :

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్ మోహన్ రెడ్డి మేడ్చల్,మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు పూర్తి మద్దతు ఇవ్వాలని సామ రామ్ మోహన్ రెడ్డి కోరారు. పట్టభద్రుల సమస్యలను శాసన మండలి వేదికగా సమర్థవంతంగా ప్రస్తావించి, వారి హక్కులు మరియు ప్రయోజనాల పరిరక్షణ కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన ఆకాంక్షించారు. అనంతరం తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, పట్టభద్రులు నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందడుగు వేయాలని సూచించారు.



సామ రామ్ మోహన్ రెడ్డి విజయం కోసం క్షేత్రస్థాయి నుంచి విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులను పెద్ద సంఖ్యలో నేరుగా కలుస్తూ, కాంగ్రెస్ అభ్యర్థి అభ్యర్థిత్వ విశేషాలను వివరించి ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో పట్టభద్రుల ప్రతి ఒక్క ఓటు ఎంతో కీలకమైనదని వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి నుంచి పట్టభద్రుల వరకు విస్తృతంగా చేరుకుని ఎన్నికల ప్రచారాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులంతా సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో వరుణ యాగం,వరుణ జపం...

విశాఖపట్నం, అక్టోబర్ 07: ప్రజా న్యూస్ నెట్వర్క్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.

పారిశ్రామిక ప్రాంతంలో సుమారుగా ఐదు దశాబ్దాల పైగా చరిత్ర కలిగిన (జింక్ గాజువాక) దేవస్థానంలో మంగళవారం రాష్ట్రం నలుమూలల వర్షాలు సమృద్ధిగా కురవాలని, రాష్ట్రం శశిశ్యామలంగా ఉండాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో..వరుణ యాగం, వరుణ జపం, హోమాలు, వేదమంత్రాలతో అంగరంగ వైభవంగా సనాతన సాంప్రదాయం ఉట్టిపడే విధంగా వేద పండితులు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈవో పద్మావతి మరియు పాలకమండలి పర్యవేక్షణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశాఖ పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్, శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబు, జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త అంగ దుర్గా ప్రశాంతి పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు, కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు .



చిలుకూరు ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవం

అధ్యక్షుడిగా దొంతగాని సైదులు గౌడ్ ఎన్నిక



చిలుకూరు మండలం, అక్టోబర్ 07, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, రిపోర్టర్ సూరిబాబు :

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్143 చిలుకూరు మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మల్లెపంగు సూరిబాబు, అధ్యక్షుడిగా దొంతగాని సైదులు గౌడ్, ఉపాధ్యక్షుడిగా గంగిరెడ్డి అశోక్‌రెడ్డి, కార్యదర్శిగా బట్టు సంతోష్, సహాయ కార్యదర్శిగా కాంపాటి శ్రీనివాసరావు, కోశాధికారిగా కోళ్ల శ్రీను, సలహాదారుగా కుర్ర రామారావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా బాలేబోయిన వినయ్‌కుమార్, బట్టు శ్యామ్‌కుమార్ నాయక్, బోడ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి :

నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సమాజ అభివృద్ధిలో మీడియా పాత్రను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్‌ను పటిష్టంగా తీర్చిదిద్దుతూ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని, నిష్పక్షపాత జర్నలిజానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల గొంతుకగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

కోదాడ రూరల్ సీఐగా రామకృష్ణరెడ్డి బాధ్యతల స్వీకరణ

మునగాల నుంచి బదిలీపై వచ్చిన అధికారి..

శాంతిభద్రతలకు ప్రాధాన్యం



కోదాడ, అక్టోబర్ 07, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

కోదాడ రూరల్ సీఐగా రామకృష్ణరెడ్డి నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో మునగాల సీఐగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై కోదాడ రూరల్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై స్టేషన్ పరిధిలోని పరిస్థితులు, కేసులు, శాంతిభద్రతలపై వివరాలు తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అనారోగ్యంతో మృతి చెందిన షేక్ ఫరీద్ కుటుంబానికి పాశం. గోపాల్ రెడ్డి ఆర్థిక సహాయం అందజేత



గుర్రంపోడు, (ప్రజా న్యూస్ రిపోర్టర్):

మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో బొడ్రాయి ఎదురుగా నివాసముంటూ, ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన షేక్ ఫరీద్ కుటుంబ సభ్యులను బుధవారం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి (PGR) పరామర్శించారు. ఫరీద్ మృతి పట్ల వారు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక ఇబ్బందుల దృశ్య ఆర్థిక సహాయాన్ని అందజేసి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో వేముల యాదయ్య, షేక్ కాసిం, వినయ్, జానీ పాషా, పవన్, వేముల సరస్వతి, మహమ్మద్ అబ్బాస్, వేముల లక్ష్మమ్మ, ఇటికాల లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

చౌటపల్లిలో వివాహిత మృతి.. కేసు నమోదు

35 ఏళ్ల మహిళ మృతిపై భర్త ఫిర్యాదు..

దర్యాప్తు ప్రారంభించిన మఠంపల్లి పోలీసులు

మఠంపల్లి మండలం, అక్టోబర్ 07,
ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

చౌటపల్లి గ్రామానికి చెందిన శీలం అంజలి (35) మృతి చెందారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఆమె మృతి చెందినట్లు మఠంపల్లి పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త శీలం సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతిపై తనకు ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.